సాక్షి రంగారెడ్డి

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



‘హస్తం’తోనే అభివృద్ధి

పాలమూరు అభివృద్ధి వంశీచంద్‌రెడ్డితోనే సాధ్యమని.. భారీ మెజార్టీతో గెలిపించాలని సతీమణి చల్లా అశ్లేషారెడ్డి కోరారు 8లో ▸



మోదీతోనే దేశప్రగతి

చేవెళ్ల లోక్‌సభ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో ▸



కూచిపూడిలో ఘన‘కీర్తి’

కూచిపూడి నృత్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కీర్తి ఉన్నతంగా రాణిస్తోంది. పలు అవార్డులు అందుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా

కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

తుర్కయంజాల్: లోక్‌సభ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అభ్యర్థించారు. మున్సిపల్ పరిధి రాగన్నగూడలోని ప్రముఖ్ టౌన్‌షిప్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు తనకు తెలుసని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు మర్రి మాధవి, కుంట ఉదయశ్రీ, రేవల్లి హరిత, నాయకులు సామ భీంరెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎల్మటి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్‌కు మోదీ కృషి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న కిషన్‌రెడ్డి, రాజవర్ధన్ సింగ్ రాథోడ్

హిమాయత్‌నగర్: అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణగూడ కేశవ్ మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సర్దార్ పటేల్ ఆడిటోరియంలో జరిగిన వికసిత్ భారత్ అంబాసిడర్ల సమావేశంలో రాజస్థాన్ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్‌తో కలిసి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డు మ్యాప్ వేశారని, 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా రూపుదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. 2047 వరకు మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. రాజస్థాన్ మంత్రి రాజవర్ధన్ సింగ్ రాథోడ్ మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ హయాంలో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు అవినీతి జరిగిందన్నారు. దేశంలో 60 ఏళ్లు అధికారంలో ఉన్న కుటుంబంవారే లీకేజీలు మొదలుపెట్టారని, 2014 తర్వాత దేశంలో అవినీతికి, లీకేజీలకు అవకాశం లేకుండా చేసిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. మోదీని మూడోసారి ప్రధానిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నమో యాప్ కోఆర్డినేటర్ శైలేష్ పాండే, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్ నాథ్ సారంగుల, సోషల్ మీడియా కన్వీనర్ సుమిరాన్ కొమర్రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలపర్చండి: ఈటల రాజేందర్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

నాగోలు: లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ కమలానికి ఓటు వేసి గెలించాలని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నాగోలు డివిజన్‌లోని ఆదర్శనగర్ కాలనీలో గుజరాతీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలో రావాలని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ మల్కాజిగిరి నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు చింతల సురేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీత ప్రచారం



పరిగిలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

పతుల కోసం సతులు

ప్రచారంలో అభ్యర్థుల బంధుగణం

- తమవారి గెలుపు కోసం రంగంలోకి..
- ఇంటింటికీ తిరుగుతూ.. ఓటర్లకు అభ్యర్థన
- మండుతున్న ఎండలను సైతం లెక్క చేయక పర్యటనలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థుల తరఫున పార్టీ శ్రేణులే కాదు.. అభ్యర్థుల సతీమణులు, బంధువులు ప్రచార రంగంలోకి దిగారు. అభ్యర్థుల గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఉదయం వేళల్లో పార్కులు, యోగా కేంద్రాల్లో ప్రచారం చేస్తూ.. సాయంత్రం వేళ కాలనీ సంక్షేమ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం భగ్గున మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా మండల కేంద్రాలు, మారు మూల గ్రామాల్లో పర్యటిస్తున్నారు. స్థానికంగా ఉన్న పార్టీ కేడర్‌ను వెంట బెట్టుకుని ముందుకు సాగుతున్నారు. అవ్వ.. తాత.. పెద్దమ్మ.. పెద్దనాన్న.. అన్నా.. వదిన.. తమ్ముడు.. చెల్లి అంటూ వరుసలు కలిపి కనిపించిన వారినల్లా ఆప్యాయంగా పలకరిస్తున్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే.. ఏమేమి చేయనున్నారో వివరిస్తున్నారు. వారి ప్రచార ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

ఎవరెక్కడ ప్రచారం చేశారంటే ..

- చేవెళ్ల లోక్‌సభ స్థానం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి పరిగిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారంజిత్‌రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఇస్నాపూర్ విల్లాస్‌లో ప్రచారం చేయగా, కుమార్తె పూజా ఆకాంక్ష రెడ్డి ఇస్నానా ల్యాంకోహిల్స్‌లో ప్రచారం చేశారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరఫున ఆయన సతీమణి చంద్రకళ శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఆయన కుమారుడు వీరేశం వికారాబాద్, చేవెళ్ల, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు.
- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సతీమణి చల్లా అశ్లేషారెడ్డి షాద్‌నగర్, కేశంపేట మండలాల్లో ప్రచారం నిర్వహించారు.
- కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి చామల డింపుల్ రెడ్డి మంచాల మండలం ఎల్లమ్మ తండాలో ప్రచారం చేశారు.
- కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తరఫున ఆయన కుమారుడు ఆర్యన్ రెడ్డి శంకర్‌పల్లిలో ప్రచారం నిర్వహించారు.



రాజేంద్రనగర్‌లో కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ



మంచాల మండలంలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సతీమణి డింపుల్‌రెడ్డి

‘కాసాని’ని గెలిపిద్దాం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మొయినాబాద్: వ్యాపార వేత్తలు రాజకీయాల్లోకి వస్తే రాజకీయాలను కూడా వ్యాపారంగా మారుస్తారని.. జిల్లాలో అదే జరగబోతోందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్‌లో ఆదివారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గం ప్రజలు కేసీఆర్ పంపిన అభ్యర్థినే ఇప్పటి వరకు గెలిపించారన్నారు. 2014లో కొండా విశ్వేశ్వరరెడ్డి, 2019లో రంజిత్ రెడ్డి కారు గుర్తుపైనే గెలిచారని గుర్తు చేశారు. ఇప్పుడు కేసీఆర్ బడుగు బలహీన వర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను పంపారని.. ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం రాకపోయినా.. కూతురు జైలుకెళ్లినా అధైర్యపడకుండా గుండె నిబ్బరంతో పార్టీని ముందుకు తీసుకెళ్తున్న కేసీఆర్‌ను కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలన్నారు. ఈ ప్రాంతంలో 111 జీఓ ఎత్తేసి కొత్త జీవో తెచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. రంజిత్‌రెడ్డి మానవత్వం లేని మనిషని.. ఎవరో తెలియని రంజిత్ రెడ్డిని ఎంపీగా చేసి ఆయనకు మంచి స్థానం కల్పిస్తే కేసీఆర్ కష్టాల్లో ఉన్నప్పుడు వదిలేసి వెళ్లారని మండిపడ్డారు. ఆయన మోసాన్ని కార్యకర్తలు పసిగట్టాలన్నారు. కొందరు నాయకులు పార్టీ వదిలి వెళ్లారని ఎవరూ అధైర్య పడొద్దని... ఈ ఎన్నికల్లో గట్టిగా పనిచేసి ఎంపీగా కాసానిని గెలిపిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరే నాయకులవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, లోక్‌సభ ఇన్‌చార్జి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మైనార్టీ నేత షేక్ మహబూబ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవుఫ్, రాజు, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్, గణేశ్‌రెడ్డి, రితీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

తెలుగు రుచులను విశ్వవ్యాప్తం చేయాలి

బంజారాహిల్స్: తెలుగు రుచులు, సంస్కృతీ సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయాలని తెలంగాణ ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. తెలుగు రుచులు, సంస్కృతుల వైభవాన్ని చాటి చెప్పేందుకు ఓనమాలు పేరుతో భరణి లే అవుట్‌లోని ది కలినరీ లాంజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పలు రకాల ప్రాచీన తెలుగు రుచులను రుచి చూశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యుడు గురువారెడ్డి మాట్లాడుతూ.. వెనకటి కాలంలో వాతావరణ పరిస్థితులు కాలాలను బట్టి వంటలు వండుకునేవారు. అవేవీ ఇప్పుడు కనిపించడం లేదు. కానీ అలాంటి వాటిని మళ్లీ ఇప్పుడు వెలుగులోకి తీసుకొచ్చి విశ్వ వ్యాప్తం చేసేందుకు ఓనమాలు సంస్థ ప్రయత్నించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పిండివంటలు, తెలంగాణ, ఆంధ్ర ప్రాచీన వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీనాథ్, మామిడి హరికృష్ణ, ఓనమాలు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం స్టేట్ చైర్మన్ ముత్తినేని వీరయ్య

మొయినాబాద్‌రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ దివ్యాంగుల విభాగం స్టేట్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఎన్కెపల్లి సమీపంలోని ఎంపీ రంజిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఆదివారం పార్టీ దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహాచారి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులు, పెరిక కులస్తులతో కలిసి విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ.. దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, పింఛన్‌దారులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దివ్యాంగులకు మొండి చేయి చూపిందని విమర్శించారు. పెరిక కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం గొప్ప నిర్ణయం అని, అందుకే పెరికల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. చేవెళ్ల నుంచి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు సతీష్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మద్దపాగ సురేష్, పెరిక కులాల కార్పొరేషన్ సాధన కమిటీ అసోసియేషన్ అధ్యక్షుడు కోట మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే స్ఫూర్తితో పెట్టుబడి, దోపిడీదారుల దౌర్జన్యాలు, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడి.. హక్కులు సాధించుకుంటూ కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఎనిమిది గంటల పని దినం కోసం ఎంతో మంది కార్మికులు ప్రాణాలు అర్పించి పోరాటం చేశారని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విదేశీ పెట్టుబడిదారుల మోజులో పడి కార్మిక వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా చట్టాలను చేసిందని ఆరోపించారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా నిర్వహించే కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

కార్మిక వ్యతిరేక బీజేపీని ఓడించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: దేశంలో కార్మిక చట్టాలకు తూట్లు పొడిచి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.భూపాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఆదివారం సీఐటీయూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ కార్మిక చట్టాలను మార్చి ఎనిమిది గంటల పని దినాన్ని లేకుండా చేసి 12 గంటల పని దినాలను తెచ్చే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌లతో కనీస వేతనం అమలయ్యే పరిస్థితి లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు జగదీశ్, స్వప్న, రుద్రకుమార్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో 8,81,201

- గ్రేటర్‌లో రద్దయిన ఓటర్ల సంఖ్య
- అత్యధికంగా హైదరాబాద్‌లో 5.41 లక్షలు
- రంగారెడ్డిలో 2.6 లక్షలు.. మేడ్చల్‌లో 80 వేలు



సాక్షి, సిటీబ్యూరో: ఓటరు జాబితాలో ప్రక్షాళనలో భాగంగా భారత ఎన్నికల సంఘం గత రెండేళ్లలో గ్రేటర్ హైదరాబాద్‌లో 8,81,201 ఓట్లను తొలగించింది. అత్యధికంగా హైదరాబాద్‌లో 5,41,201 మంది ఓట్లను తొలగించారు. ఇందులో 4,39,801 మంది నివాసం మారగా.. 54,259 మంది డూప్లికేట్, 47,141 మంది ఓటర్లు మరణించారు. రంగారెడ్డి జిల్లాలో 2.6 లక్షలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 80 వేల ఓట్లను తొలగించారు.

కొత్తగా 14 లక్షల ఓటర్ల నమోదు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలతో కూడిన గ్రేటర్‌లో ప్రస్తుతం కోటి కంటే ఎక్కువ మంది ఓటర్లున్నారు. గత రెండేళ్లలో గ్రేటర్‌లో కొత్తగా 14 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారు. దాదాపు 5 లక్షల ఓటర్ల గుర్తింపు కార్డులలో సవరణలు జరిగాయి. నగరంలోని నియోజకవర్గాల్లో అత్యధికంగా శేరిలింగంపల్లిలో 7.47 లక్షల మంది ఓటర్లున్నారు. ఆ తర్వాత కుత్బుల్లాపూర్‌లో 7.12 లక్షలు, మేడ్చల్‌లో 6.58 లక్షలు, ఎల్బీనగర్‌లో 6 లక్షల మంది ఓటర్లున్నారు. అత్యల్పంగా చార్మినార్ నియోజకవర్గంలో 2.28 లక్షల మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు.

10 వేల పోలింగ్ స్టేషన్లు

ఓటరు ప్రక్షాళన ప్రక్రియలో మూడు జిల్లాల్లో దాదాపు 11 వేల మంది సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌ఓపీ ప్రకారం ఫారం–7, ఫారం–8లను సేకరించిన తర్వాతే ప్రక్షాళన ప్రక్రియ నిర్వహించామని అధికారులు తెలిపారు. మహిళలు, పర్సన్స్ విత్ డిజెబిలిటీస్ (పీడబ్ల్యూడీ), యువత నిర్వహించే పోలింగ్ కేంద్రాలతో పాటు థీమ్ ఆధారిత పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు పార్కుల వద్ద స్వీప్ క్యాంపులు, ఓటర్లను ఆకర్షించేందుకు భారీ బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి గ్రేటర్‌లో 10 వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసున్నారు.

జిల్లా.. విభిన్నతల ఖిల్లా

- ఐదు లోక్‌సభ స్థానాలతో లింక్
- మహబూబ్‌నగర్‌లో షాద్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో కల్వకుర్తి
- భువనగిరిలో ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరిలో ఎల్బీనగర్
- చేవెళ్లలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పల్లె.. పట్నం కలబోత. భౌగోళికంగా ఏడు జిల్లాల సరిహద్దులతో విస్తరించి ఉన్న అరుదైన ఘనత. తెలంగాణలోనే శరవేగంగా విస్తరిస్తోంది జిల్లా. ఐటీ, పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకుపోతోంది. జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా గుర్తింపు పొంది ప్రస్తుతం విభిన్న పరిస్థితులను ఎదుర్కొంటోంది. తెలంగాణలోనే కాదు.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఐదు లోక్‌సభ స్థానాల పరిధిలో విస్తరించి ఉండటం.. ఇటు రాజకీయంగానే కాదు అటు పరిపాలనా పరంగా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం ఒక్కో లోక్‌సభ స్థానం పరిధిలో కొనసాగుతుండటంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకే కాదు, పోలీసు యంత్రాంగానికి చిక్కులు తప్పడం లేదు.

దేశంలోనే మొదటి స్థానంలో మల్కాజిగిరి..

దేశంలోనే అత్యధిక ఓటర్లు ఉన్న జాబితాలో మల్కాజిగిరి మొదటిస్థానంలో ఉంది. మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కంటోన్మెంట్, మేడ్చల్ సహా జిల్లాలోని ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఇదే లోక్‌సభ పరిధిలో కొనసాగుతోంది. ఇక్కడ మొత్తం 37,28,417 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎల్బీనగర్ ఓటర్లే 6,00,552 మంది ఉండటం విశేషం. అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించడంలో జిల్లా పరిధిలోని ఎల్బీనగర్‌కు చెందిన ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారు.

తెలంగాణలో చేవెళ్ల రెండోది..

తెలంగాణలో అత్యధిక ఓటర్లు ఉన్న రెండో అతిపెద్ద లోక్‌సభ స్థానంగా చేవెళ్లకు గుర్తింపు ఉంది. వికారాబాద్, పరిగి, తాండూరు సహా జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ మొత్తం 29,19,465 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లికి చెందిన వారే 21,72,811 మంది ఓటర్లు ఉండటం గమనార్హం.

అక్కడి అభ్యర్థులు.. ఇక్కడి ఓటర్లు

- జిల్లాలోని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో కొనసాగుతోంది. ఈ లోక్‌సభ స్థానంలో 18,04,930 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఒక్క ఇబ్రహీంపట్నంలోనే 3,37,134 మంది ఓటర్లు ఉన్నారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యధిక ఓటర్లు ఇక్కడే ఉండటం, అభ్యర్థుల గెలుపోటములు వీరిపైనే ప్రధానంగా ఆధారపడ్డాయి.
- జిల్లాలోని కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో కొనసాగుతోంది. ఈ లోక్‌సభ స్థానంలో మొత్తం 17,34,773 మంది ఓటర్లు ఉండగా, వీరిలో కల్వకుర్తికి చెందిన వారు 2,43,098 మంది ఉన్నారు.
- షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం పరిధిలో కొనసాగుతోంది. ఈ స్థానంలో 16,80,417 మంది ఓటర్లు ఉండగా, వీరిలో షాద్‌నగర్ ఓటర్లే 2,38,392 మంది ఉన్నారు. ఆయా పార్టీల అభ్యర్థుల జయాపజయాలను జిల్లా ఓటర్లే నిర్దేశించనున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ..

షాద్‌నగర్ రూరల్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. పట్టణంలోని జడ్చర్ల రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. పట్టణ ప్రధాన కూడలి మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లేందుకు డ్రైవర్ బస్సును యూటర్న్ తీసుకునే క్రమంలో నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వ్యక్తి తలపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినా.. ఆచూకీ లభించిన పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



'హస్తం'తోనే పాలమూరు అభివృద్ధి

- వంశీచంద్‌రెడ్డి సతీమణి అశ్లేషారెడ్డి
- షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యేతో కలిసి ఇంటింటి ప్రచారం



కేశంపేట: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న అశ్లేషారెడ్డి, విశాల తదితరులు

షాద్‌నగర్/కేశంపేట/కొత్తూరు: పాలమూరు అభివృద్ధి వంశీచంద్‌రెడ్డితోనే సాధ్యమని.. కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని భార్య చల్లా అశ్లేషారెడ్డి కోరారు. ఆదివారం ఆమె షాద్‌నగర్, కేశంపేట మండల కేంద్రం, కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్లేషారెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో విసిగిన ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారని.. అదే స్ఫూర్తితో లోక్ సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించాలని కోరారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఉంటే ఇందిరమ్మ రాజ్యం ఏర్పడతుందని వివరించారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. అనంతరం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ కొత్త మేనిఫెస్టోతో ఎన్నికలకు వస్తోందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులను ఓట్ల కోసం వస్తే గతంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని నిలదీయలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

'వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిద్దాం'

కొత్తూరు మున్సిపాలిటీ నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. యువనాయకుడి పార్లమెంట్‌కు పంపిస్తే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌కు ఓటేసి మోసపోవద్దన్నారు. ఆయా ప్రచారాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సతీమణి అనురాధ, కేశంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఎంపీటీసీ సభ్యుడు సురేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, గిరియాదవ్, పల్లె ఆనంద్‌కుమార్, అమీర్, అల్వాల ప్రకాశ్‌గౌడ్, శివవర్ధన్ రెడ్డి, కోడూరు రాములు, పర్వతాలు, భాస్కర్‌రెడ్డి, గోపాల్ పార్టీ కొత్తూరు నాయకులు వేణుగోపాల్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, జనార్దన్‌చారి, మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, జగన్, మహేశ్‌గౌడ్, నర్సింహ, సురేందర్, ఆంజనేయులు, నందిగామ ఎంపీపీ ప్రియాంక, కౌన్సిలర్లు కరుణశ్రీ, హేమ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థం తర్వాత ఆగిన పెళ్లి

- గతంలోనూ ఇద్దరితో..
- యువకుడు, కుటుంబ సభ్యులపై కేసు

కేశంపేట: పెళ్లి చేసుకుంటానని నిశ్చితార్థం చేసుకుని ముఖం చాటేసిన యువకుడితో పాటు కుటుంబ సభ్యుల పైన కేసు నమోదయింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన చెదురువెల్లి యువతికి తలకొండపల్లి మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన యాదగిరితో ఆరు నెలల క్రితం నిశ్చితార్థం చేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పెళ్లి ఖర్చుల నిమిత్తం భూమిని విక్రయించి, పెళ్లి ముహూర్తం కోసం యాదగిరి కుటుంబ సభ్యులను సంప్రదించగా వారు పెళ్లి ఇష్టం లేదని సాకులు చెప్పారు. యాదగిరి గతంలో ఇద్దరితో నిశ్చితార్థం జరిగిందని బాధితురాలు ఆరోపించారు. ఇప్పటికే కట్నం నిమిత్తం రూ.5లక్షల నగదు, బంగారు ఉంగరం ఇచ్చామని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైటర్ కొన్ని విషయాలను దాచిపెట్టారని బాధితురాలు ఆరోపించి యాదగిరికి గతంలో జరిగిన నిశ్చితార్థ ఫొటోలను చూపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యాదగిరి, అతడి తల్లి కళమ్మ, అక్కలు అలివేలు, శ్రీలతలపై కేసు నమోదు చేశామన్నారు. కట్నకానుకల నిమిత్తం యాదగిరి కుటుంబ సభ్యులకు రూ.5లక్షల నగదు, బంగారు రింగ్‌ను ఇచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నా రైటర్ ఈ విషయాలను దాచిపెట్టి మిగత విషయాల పైనే కేసును నమోదు చేసినట్టు ఆరోపించారు. యాదగిరి తనతో పాటు మరో ఇద్దరితో నిశ్చితార్థం జరిగిన పోటోలను మీడియాకు ఇచ్చారు.

బావిలో దూకి మహిళ బలవన్మరణం



పార్వతమ్మ(ఫైల్)

చేవెళ్ల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ మనస్తాపం చెంది బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని ఊరెళ్లలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి పార్వతమ్మ(65) గర్భసంచి తొలగింపు ఆపరేషన్ అనంతరం కడుపునొప్పితో బాధ పడుతోంది. వైద్యం చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపంతో శనివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో అక్కడి వెళ్లిచూసి పార్వతమ్మగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

టిప్పర్ సీజ్

యజమాని, డ్రైవర్‌పై కేసు

కేశంపేట: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేసి డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం మీదుగా మట్టితరలిస్తున్న టిప్పర్‌ను ఆపి డ్రైవర్‌ను పత్రాలు చూపమన్నారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ శివకుమార్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లింగం కేసునమోదు చేశారు.

మోదీతోనే దేశప్రగతి

బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బీజేపీలో చేరిన వారితో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు: చేవెళ్ల లోక్‌సభ అభివృద్ధి బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, పున్న భిక్షపతి ఆధ్వర్యంలో ఆదివారం రాచలూరు మాజీ సర్పంచ్ పులిగిల్ల శ్రీనివాస్‌చారి, చంద్రయ్య, ఆంజనేయులు, రవీందర్, యాదగిరి, శ్రీశైలం, నరేందర్, భిక్షపతి, జగన్నాథం తదితరులు కమలం గూటికి చేరారు. వారికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రగతి, సమగ్రత ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. దేశం కోసం జరుగుతున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరే అవుతుందన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ కనుమరుగు అవడం ఖాయమని జోస్యం చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తుతెలియని మృతదేహాన్ని అత్తాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుల్ నరేష్ రెడ్డి వివరాల ప్రకారం..అత్తాపూర్ భరత్‌నగర్ కాలనీలో గుర్తుతెలియని ఓ వ్యక్తి (50) మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎండ తీవ్రతకు చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

- రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఆయన సతీమణి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డి



అస్పల్లిగూడలో ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ బోర్డు మెంబర్ సీతారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె మండల పరిధిలోని చర్లగూడ, ఎల్గొండగూడ, అస్పల్లిగూడ గ్రామాల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డిలతో కలిసి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని.. ఆగస్టు 15 నాటికి రైతుల రుణమాఫీని అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్ బాగుంటుందని, పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఏ-బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు అశ్విని, ఎంపీటీసీ సభ్యులు జయమ్మ, చెన్నయ్య, మల్లేశ్, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, బుచ్చయ్య, సత్యం తమ్మలి రవీందర్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నాయకులు పెంటయ్య, జాకీర్‌షరీఫ్, నర్సింహులు, అక్తర్‌పాషా, గడ్డం చంద్రయ్య, చేవెళ్ల స్వామి, కుద్దూస్, శ్రీరాంరెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి



దండుమైలారంలో ప్రచారం చేస్తున్న వెంకటరమణారెడ్డి, కృపేష్

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని దండుమైలారంలో ఎంపీపీ కృపేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎల్మినేడు గ్రామంలో ఇబ్రహీంపట్నం వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ఆయన వెంట దొమకొండ నర్సింహ, మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి, నర్సింహ, యాదయ్య తదితరులున్నారు. నాగన్‌పల్లి గ్రామంలో పార్టీ అధ్యక్షుడు అంజయ్య తదితరులు ఇంటింటి ప్రచారం చేశారు.

కూచిపూడిలో ఘన'కీర్తి'

- ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి వరుస అవార్డులు
- 2023లో రెండు జాతీయ పురస్కారాలు
- ఈ ఏడాది మయూరి జాతీయ పురస్కారం



మయూరి పురస్కారం అందుకుంటున్న కీర్తి (ఫైల్)

కొందుర్గు: కూచిపూడి నృత్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కీర్తి ఉన్నతంగా రాణిస్తోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పిర్జాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పోమాల కీర్తి స్వగ్రామం కొందుర్గు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిలో చేరింది. ఏడేళ్ల ప్రాయంలోనే నృత్యంపై ఆసక్తితో అజయ్ నటరాజ కళా నిలయంలో చేరి అధ్యాపకులు శ్రీదేవి, ప్రదీప్ కుమార్ వద్ద కూచిపూచి నృత్యం సాధన చేసింది. జిల్లా స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంది. 2023 ఫిబ్రవరిలో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో జాతీయ పురస్కారం అందుకున్నారు. ఏప్రిల్‌లో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనతో మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ ఏడాది తెలుగు వెలుగు సాహితి వేదిక వారు నిర్వహించిన ఉగాది పురస్కారాలలో ప్రతిభచూపి మయూరి జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి మాత ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలుగు వెలుగు సాహితి వేదిక గౌరవ అధ్యక్షులు వంగాల శాంతి కృష్ణ ఆచార్య, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్ర కుమార్, తెలుగు వెలుగు సాహితీ వేదిక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ సమన్వ కర్త మానపాటి ప్రదీప్ కుమార్, తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ వలబోజు మోహన్‌రావు తదితరులు ఆమెకు పురస్కారాన్ని అందజేశారు. దీంతో ఉపాధ్యాయురాలు కీర్తి ప్రజలు అభినందిస్తున్నారు.

చేవెళ్లపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మతతత్వ బీజేపీకి బుద్ధి చెబుదాం

- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



అనితారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంగారం, గంగారం తండా, మైలార్‌బాయి తండాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు ముడావత్ దేవేందర్ నాయక్ ఆయన అనుచరులు, బీఆర్‌ఎస్ నాయకులు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. గత పదేళ్లు దొరలపాలన సాగిందని.. సంక్షేమం ముసుగులో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. మతతత్వ బీజేపీకి ప్రజలకు ఓటుతో బుద్ధిచెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒకటేనని ఆ పార్టీలను ప్రజలు నమ్మరన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి కంచుకోటగా తయారు చేస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారిలో ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎం.శాంతి నాయక్, బీజేపీ నాయకులు సిరిగిరిపురం మాజీ ఉప సర్పంచ్ సూర్య నాయక్, శంకర్ నాయక్, రాజేందర్, వెంకటయ్య, కృష్ణం రాజు, మహేందర్, రాజ్‌కుమార్, అంజయ్య, నాగరాజ్ ,శ్రీనివాస్, శాంతి తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంగోత్ కృష్ణా నాయక్, ముడావత్ పాండు నాయక్, అంధ్యా నాయక్, నేనావత్ రాజ్ కుమార్ నాయక్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.